


మేఘమాల..

తిరుమల వాతావరణం సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా చిరుజల్లులతో ఆహ్లాదకరంగా మారింది. ఒకవైపు పొగమంచు, మరోవైపు చిరుజల్లులతో ప్రకృతి రమణీయత సంతరించుకుంది. చలితీవ్రత కొంత కనిపించింది. బ్రహ్మోత్సవాల వేళ తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది.

విరుల పందిరి

స్నపన తిరుమంజనం నేపథ్యంలో ఆలయంలో పుష్పాలంకరణ ఆకట్టుకుంది. శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోందని తితిదే అధికారులు తెలిపారు. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటలు పడుతోంది. శ్రీవారిని ఆదివారం 86,859 మంది దర్శించుకున్నారు. హుండీ కానుకలు రూ.3.63 కోట్లు లభించాయి.

- న్యూస్‌టుడే, తిరుమల



కల్పవృక్షంపై తేజసం.. భూపాలుడిపై రాజసం

మూడోరోజు వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల, న్యూస్‌టుడే: కొండా చూతమురారో కొండొక తిరుమల కొండా.. కొండనియడిగిన వరములొసగు.. అంటూ శ్రీవారి వైభవాన్ని తిరుమల విశిష్ఠతను అన్నమాచార్య తన సంకీర్తనల్లో అక్షరబద్ధం చేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవ వేళ లక్షల మంది భక్తులు సప్తగిరుల్లో కిక్కిరిసి కనిపిస్తున్నారు. గోవింద గోవిందయని కొలువవో మనసా.. అంటూ స్వామివారిని కీర్తిస్తూ ఆ వైభవాన్ని కనులారా వీక్షిస్తూ తరిస్తున్నారు. ఈ జన్మకు ఈ భాగ్యము చాలదా.. అంటూ తన్మయత్వం పొందుతున్నారు.









● తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ కనుల పండువగా జరిగింది. వేణుగోపాల స్వామి అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి భక్తులకు అభయమిచ్చారు. ● రాత్రికి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి సర్వభూపాల వాహనంపై శ్రీకాళీయ మర్దనుడి అలంకారంలో దర్శనమిచ్చారు. సర్వభూపాల అంటే అందరు రాజులు అని అర్థం. వీరందరూ స్వామివారిని తమ భుజస్కంధాలపై, హృదయంలో ఉంచుకుని సేవిస్తారు. తద్వారా వారి పాలనలో ప్రజలు ధన్యులవుతారనే సందేశాన్ని ఈ వాహనసేవ నుంచి గ్రహించవచ్చు.















నేటి సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్ఠమైన శ్రీవారి గరుడ వాహనసేవ మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు మొదలై 11 వరకు కొనసాగనుంది. ఉదయం 8 నుంచి 10 గంటలకు శ్రీమలయప్ప స్వామి మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

దారులన్నీ ఏడుకొండల వైపే..!

గరుడ వాహన సేవకు తరలివస్తున్న భక్తులు

ఈనాడు-తిరుపతి; తిరుమల, తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: అన్ని దారులూ అందరి నడకా ఆ సప్తగిరుల వైపే.. ఏ వాహనం చూసినా తిరుమల కొండకు ప్రయాణం కడుతోంది. తమవంతూ ఆ శ్రీనివాసుని చెంతకే అన్నట్లుగా పాదయాత్ర భక్తులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించనున్న కీలకమైన గరుడ వాహన సేవలో ఆ జగద్రక్షకుడైన శ్రీహరిని దర్శించుకునేందుకు తండోపతండాలుగా తరలిస్తున్నారు. నడకదారిలో అలిపిరి పాదాల మండపం నుంచి వడివడిగా అడుగులు వేస్తూ.. ఇక ఆ కాస్త మెట్లు ఎక్కేస్తే ఆ కోనేటి రాయుణ్ని తిలకించవచ్చంటూ భక్తిపారవశ్యంలో పులకించిపోతున్నారు.



అలిపిరి మెట్ల మార్గంలో భక్తుల రద్దీ

● గరుడోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు శ్రీమలయప్పస్వామి మాడవీధుల్లో విహరించనున్నారు. సుమారు 3.5 లక్షల మంది భక్తులు వాహన సేవను తిలకించేందుకు ఆస్కారం ఉంది. గ్యాలరీల్లో సుమారు రెండు లక్షల మంది వీక్షించేలా ఏర్పాట్లు చేశారు.

● గ్యాలరీల వెలుపల ఉన్న భక్తులు వాహన సేవను తిలకించేలా ఏర్పాట్లు చేశారు. శ్రీమలయప్పస్వామి వాహన మండపం నుంచి వెలుపలికి వచ్చి తూర్పు మాడవీధి నుంచి దక్షిణం వైపు మళ్లిన తర్వాత ఆలయం ఎదురుగా ఉన్న గ్యాలరీల్లోని భక్తులను ఖాళీ చేయించి అక్కడ మళ్లీ కొత్త వారితో నింపనున్నారు. దీని వల్ల ఎక్కువమంది స్వామిని వీక్షించేందుకు వీలుంటుంది.

ఎక్కువ మంది దర్శించుకునేలా..



● సుపథం, మ్యూజియం, గోవింద నిలయం, మేదరమెట్ట, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాల వైపు నుంచి మాడ వీధుల్లో వాహనానికి ఇరువైపులా తాళ్లను ఏర్పాటు చేసి భక్తులకు స్వామిని దర్శించుకునే వీలు కల్పించనున్నారు. దీనివల్ల ఒక్కో మార్గం నుంచి అదనంగా 20 వేల మంది దర్శించుకోవచ్చు. తిరుమలలోని ముఖ్య కూడళ్లలో 32 ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. ఇందులో తొమ్మిది పెద్ద తెరలు ఉన్నాయి.

అర్ధరాత్రి వరకు అన్నప్రసాదం



మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని ఉదయం 7 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు. అదనంగా తిరుమలలోని పలు ప్రాంతాల్లో అన్నప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో గరుడ సేవ రోజున 8.30 లక్షల మేరకు ఆహార పొట్లాలు అందించగా, ప్రస్తుతం 12.40 లక్షల మందికి సమకూర్చేలా ఏర్పాట్లు చేశారు.

మూడువేల ట్రిప్పులు



తిరుపతిలో ఎంపిక చేసిన ఐదు కేంద్రాల్లో వాహనాలు నిలుపుకొనే ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు వేశారు. వీటిద్వారా గరుడసేవ రోజే మూడువేల ట్రిప్పులు తిప్పనున్నారు. తిరుమలలో వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు. సుమారు 15 ప్రాంతాల్లో 8,000 వాహనాలు పార్కింగ్ చేసుకునేలా చర్యలు చేపట్టారు.

పది ప్రాంతాల్లో జియో ట్యాగింగ్



చిన్నారులు, వృద్ధులు, మానసిక వికలాంగులు తప్పిపోతే గుర్తించడానికి వీలుగా జియో ట్యాగింగ్ అందుబాటులోకి తీసుకువచ్చారు. అందులో తల్లిదండ్రుల పేర్లు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లను నమోదు చేస్తున్నారు. పోలీసు విభాగం నుంచి 60 మంది, బాలల సంక్షేమ శాఖ నుంచి 20 మంది, తిరుమల బాలాజీనగర్‌లోని 120 మంది స్థానికులను వాలంటీర్లుగా నియమించారు. మొత్తం పది ప్రాంతాల్లో జియో ట్యాగింగ్ కొనసాగుతోంది. బ్రహ్మోత్సవాలకు వచ్చిన చిన్నారులు, నడవలేని వృద్ధులు, మానసిక వికలాంగులు 15 వేలమందికి ఇప్పటివరకు జియోట్యాగింగ్ చేశామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తప్పిపోయిన 15 మందిని అప్పగించామన్నారు. భక్తులు అవసరమైతే పోలీసులు, వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

దొంగల ఆటకట్టించేందుకు సాంకేతికత..




రద్దీ సమయంలో దొంగలు భక్తుల విలువైన ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు చోరీచేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తిరుమల క్రైమ్ పీఎస్ సీఐ శేషగిరిరావు తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి సోమవారం వరకు 80 మంది అనుమానితులను అదుపులోకి తీసుకోగా అందులో 11 మంది పాతనేరస్థులను గుర్తించి కేసులు నమోదు చేశారు. పాపిలాన్ డివైజర్ ఉపయోగిస్తూ వేలిముద్రల సాయంతో వారి ఆటకట్టిస్తున్నారు. ముఖ గుర్తింపు సాంకేతికత కెమెరాలు వినియోగిస్తున్నారు.

అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే 94407 96770, 0877-2289029కు సమాచారం అందించాలని కోరారు.

సహకారం.. ప్రజాప్రతినిధి స్వాహాకార్యం

- డీసీసీబీ శాఖల్లో భారీ అవినీతి
- భవనాల పేరిట సొమ్ముల కాజేత
- తెరవెనుక కీలక నేత సమీప బంధువు



పలమనేరులో అసంపూర్తిగా విడిచిపెట్టిన డీసీసీబీ శాఖ రెండో భవనం

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: సహకార రంగం అంతంత మాత్రంగా ఉన్న వేళ.. రైతులు, ప్రభుత్వ వాటాధనంతో నెలకొల్పిన బ్యాంకుకు ప్రతినిధిగా ఎన్నికై మనుగడ కాపాడాల్సిన ప్రతినిధులే.. దాన్ని ఆసరాగా చేసుకుని రూ.కోట్లు మింగిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి జిల్లా సహకార రంగంలో భారీగా వ్యాపార లావాదేవీలు కలిగిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖల భవన నిర్మాణాల పేరుతో ఆన్‌లైన్ టెండర్లు లేకుండా ప్రైవేటు వ్యక్తుల్ని నియమించుకుని నిర్మాణ ముసుగులో రూ.కోట్లు కొల్లగొట్టారు. ఈ దందా అంతా డీసీసీబీలో ఓ కీలక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో సమీప బంధువు నడిపించినట్లు సమాచారం.

పనులు చేసి.. వదిలేసి..

చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లి శాఖ భవనంలో మూడేళ్ల కిందట రూ.15 లక్షలు వ్యయం చేసి.. లాకర్లు, స్ట్రాంగ్ గదుల్ని ఏర్పాటు చేశారు. ఆ ఆధునీకరించిన వసతుల్ని ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకురాలేదు. నాలుగేళ్ల నుంచి ఖాళీగానే ఉంటోంది.

భవనమున్నా.. నిధులు దుర్వినియోగం

డీసీసీబీ పలమనేరు శాఖకు 2013లో సొంతంగా భవనం ఉంది. ఆ పక్కనే ఖాళీ స్థలంలో మరో భవన నిర్మాణాన్ని 2023 మార్చిలో రూ.కోటి అంచనాతో ప్రారంభించారు. నిజానికి బ్యాంకు శాఖ భవనం ఇదివరకే ఉన్నా.. నిధులు స్వాహా చేయడమే లక్ష్యంగా అనవసర వ్యయానికి తెరతీశారు. ఆన్‌లైన్ టెండర్ విధానాన్ని తుంగలో తొక్కి.. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఓ మేనేజర్ స్థాయి అధికారి పేరుతో పలమనేరు శాఖలో ఖాతా తెరచి రూ.90 లక్షలు డ్రా చేయించుకున్నారు. అయితే పనులు మాత్రం 50 శాతం కూడా పూర్తి కాలేదు.

క్షేత్రస్థాయిలో విచారిస్తాం..: నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భవనాల నిర్మాణ పనులకు సంబంధించి డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్ వివరణ కోసం 'న్యూస్‌టుడే' ప్రయత్నించగా ఆయన ఫోన్ అందుబాటులోకి రాలేదు. ఈ అంశాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్, డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి విద్యాధరి దృష్టికి తీసుకెళ్లగా.. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తామన్నారు.

నిర్మించినా అద్దెల దందా

చౌడేపల్లె శాఖ భవనాన్ని ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. నెలకు రూ.12 వేలు చెల్లించాల్సి వస్తోంది. రూ.58 లక్షలతో కొత్త భవనాన్ని 2023లో పూర్తి చేశారు. అయితే నిర్మాణం పూర్తయినా.. ఏడాదిగా భవనాన్ని ప్రారంభించలేదు. నాసిరకం పనులతో కొంత వరకు దోచుకున్నా.. అసలు లక్ష్యం నెరవేరనే లేదు. అద్దె భవనానికి రూ.1.44 లక్షల వరకు అద్దె చెల్లించారు. ఈ పనులు ప్రైవేటు వ్యక్తులతోనే చేపట్టడం గమనార్హం.

● సదుం శాఖకు సొంత భవనం లేదు.. ఓ భవనానికి అద్దె రూ.14 వేలు చెల్లిస్తున్నారు. కొత్త భవనం నిర్మాణాన్ని 2023లో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. నిర్మాణం పేరుతో ఇప్పటివరకు రూ.22 లక్షలు డ్రా చేశారు. భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తే.. ఇక తమకు కమీషన్లు మిగలవన్న ఆలోచనతో అరకొర పనులు చేసి.. తేరగా భోంచేశారు గత డీసీసీబీ పాలకవర్గ పెద్దలు. నిబంధనలకు విరుద్ధంగా వీటన్నింటికీ ఆన్‌లైన్ టెండరింగ్ విధానాన్ని అనుసరించలేదు. ఎంబుక్ ఆధారంగా బిల్లులు చెల్లించాల్సి ఉన్నా స్వస్తి పలికారు.

ఫ్రీహోల్డ్.. నిబంధనల ప్రకారమేనా?

- 84,378 ఎకరాలపై రెవెన్యూ యంత్రాంగం పరిశీలన
- నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించిన ప్రభుత్వం

జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన భూములు	
	: 84,378.66 ఎకరాలు
పునఃపరిశీలించినవి	: 16,676.65 ఎకరాలు
పెండింగ్	: 67,702.01 ఎకరాలు

ఈనాడు, చిత్తూరు: ఐదేళ్ల జగన్ పాలనలో వైకాపా ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పిందే చట్టం. గనులు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడంపైనే నేతలు దృష్టి సారించారు. ఇది చాలదన్నట్టు గతేడాది డిసెంబరులో అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పిస్తున్నామని పేర్కొంటూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో పేదల కన్నా వైకాపాలోని పెత్తందారులకే ఎక్కువ మేలు జరిగిందనే విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఈ అంశంపై పునఃపరిశీలన చేయిస్తోంది.

జిల్లాలోని 32 మండలాల్లో 1,75,197.42 ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ కింద చేర్చాలని గత ప్రభుత్వంలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. వీటన్నింటికీ యాజమాన్య హక్కులు కల్పించాలని పదేపదే ఒత్తిడి చేశారు. పై నుంచి జాబితా పంపిస్తాం.. మీరు ఆమోదిస్తే చాలన్నట్టుగా రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు వ్యవహరించారు. ఎట్టకేలకు 84,378.66 ఎకరాలకు యాజమాన్య హక్కులు కల్పిస్తున్నట్టు ప్రకటించారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

అర్హత ఉన్న వ్యక్తుల భూములకే యాజమాన్య హక్కులు కల్పించారా? లేదా? అని మరోసారి పరిశీలించేందుకు మండలాల వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. నెలాఖరులోపు ప్రక్రియ పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించింది. అక్టోబరు 15 నాటికి పునః పరిశీలన చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మరోవైపు ఫ్రీ హోల్డ్ తర్వాత జరిగిన భూముల రిజిస్ట్రేషన్లపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఫ్రీ హోల్డ్ అయిన 16,676.65 ఎకరాలను పరిశీలించారు. మరో 67,702.01 ఎకరాల అసైన్డ్ భూముల హక్కులపై పునః పరిశీలన జరుగుతోంది. ఇప్పటికే 82,408 ఎకరాలను వివాదాస్పద జాబితాలో చేర్చారు. 8,400 ఎకరాలకు సంబంధించిన పత్రాలను వైకాపా హయాంలోనే పరిశీలించినా ఫ్రీ హోల్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వనందున పరిశీలించరు.

పుంగనూరులో కీలక ప్రజాప్రతినిధి చెప్పినట్టే!

పుంగనూరు నియోజకవర్గంలో ఏకంగా 29,427.91 ఎకరాలు ఉండటం గమనార్హం. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కీలక ప్రజాప్రతినిధి, వైకాపా నేతల హెచ్చరికలతో రెవెన్యూ యంత్రాంగం నిబంధనలు గాలికి వదిలేసిందని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి.

రైతేరాజు 6లో

భళా.. నెరవేరిన కల



ఏపుగా పెరిగిన బొప్పాయి



కాయలు చూపుతున్న రైతు నవీన్‌కుమార్‌రెడ్డి

పుంగనూరు, న్యూస్‌టుడే: స్వల్ప కాలిక పంటలతో వస్తున్న నష్టాలను అధిగమించేందుకు రైతు దీర్ఘకాలిక పంటలపై దృష్టి సారించారు. అందరి రైతుల్లా కాకుండా భిన్నంగా ఆలోచించి దీర్ఘకాలిక ప్రయోజనం ఇచ్చే బొప్పాయి సాగు చేశారు. సేంద్రియ ఎరువులు, బిందు సేద్యం వంటి ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంట సాగు చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

✷ చౌడేపల్లె మండలం పుదిపట్ల గ్రామానికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో రెడ్‌లేడీ బొప్పాయి సాగు చేశారు. ఎకరాకు 6-7 పద్ధతిలో 900మొక్కలు నాటారు. ఎరువులకోసం ఎకరాకు రూ.40వేలు ఖర్చు చేశారు. దున్నకాలు, డ్రిప్, మొక్కల కొనుగోలుకు రూ.80వేలు ఖర్చు చేశారు. నాలుగు ఎకరాలకు గాను రూ.4.80లక్షలు ఖర్చయింది. సాగునీటికి బిందు సేద్యం, బోదె సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలను సాధించాలని నాణ్యమైన మొక్కలను స్వయంగా పరిశీలించి కొనుగోలు చేశారు. మొక్కల మధ్య 6-7 అడుగుల దూరం ఉండేలా నాటారు. ఎరువులను తగిన మోతాదులో వేస్తూ నీటి తడులను సక్రమంగా అందించారు. మొదళ్ల వద్ద నీరు నిలవకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. దీంతో బొప్పాయి కాయలు పెద్దవిగా, ఆకర్షణీయంగా ఉన్నాయి.

తోట వద్దనే కొనుగోలు

వ్యాపారులు తోట వద్దకే వచ్చి కిలో రూ.22తో 4కోతలు కోయగా 30టన్నుల దిగుబడితో రూ.6లక్షలకు విక్రయించారు. మరో 7కోతలు వస్తాయి వాటి ద్వారా మరో రూ.7లక్షలు రావచ్చని అంచనా. ధరలు పెరిగితే మరింత లాభం చేకూరే అవకాశం ఉంది. జులైలో కిలో రూ.13 పలుకగా ప్రస్తుతం రూ.22నుంచి రూ.24ల వరకు పలుకుతోంది. మార్కెట్‌లో ధరలు పలుకుతుండడంతో లాభాలే లభిస్తాయని రైతు నవీన్‌కుమార్‌రెడ్డి ఆశిస్తున్నారు. టమాటా, వరి పంటలతో పోల్చుకుంటే బొప్పాయి సాగు లాభదాయకంగా ఉంటుందంటున్నారు.

రైతేరాజు

మిరపనారు సాగులో జాగ్రత్తలు



మిరప నారు

పుత్తూరు, న్యూస్‌టుడే: మిరప ముఖ్యమైన వాణిజ్య పంట. దిగుబడి పెరగాలంటే ఆరోగ్యకరమైన నారు అవసరమని, అందుకు తగ్గట్టు నారు పోయడంలో జాగ్రత్తలు తీసుకోవాలని పుత్తూరు ఉద్యానశాఖ అధికారిణి వెంకట సౌజన్య పేర్కొన్నారు.

నారుమడి తయారీ ఇలా.. మిరపలో అధిగ దిగుబడులు సాధించాలంటే ఆరోగ్యవంతమైన నారు అవసరం. అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి నారు మడులు తయారు చేసుకోవాలి. ఒక మీటరు వెడల్పు, 40 మీ.పొడవు, 15 సెం.మీ. ఎత్తు గల మడిలో ఒక ఎకరం నాటేందుకు అవసరమైన నారు పెంచుకోవచ్చు. ఎక్కువ నారుమడులు తయారు చేసినప్పుడు వీటి చుట్టూ మురుగు పోయేందుకు వీలుగా 30సెం.మీ వెడల్పు గల నీటి కాల్వను ఏర్పాటు చేసుకోవాలి.

వైరస్ నివారణకు విత్తన శుద్ధి

విత్తనం ద్వారా వ్యాప్తి చెందే వైరస్‌ను నివారించడానికి ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేట్‌తో విత్తనశుద్ధి చేయాలి. 150గ్రాముల మందును లీటరు నీటిలో కరిగించి అందులో కిలో మిరప విత్తనాలు వేసి 20 నిమిషాలు నానబెట్టాలి. అనంతరం నీటితో కడిగి విత్తనాన్ని నీడలో ఆరబెట్టాలి.

రసం పీల్చే పురుగుల నివారణ

మిరప విత్తనం శుద్ధి చేయడంవల్ల తక్కువ ఖర్చుతో ఫలితాలను పొందవచ్చు. బదనిక పురుగులను పెంపొందించుకోవచ్చు. సమగ్ర సస్యరక్షణ విధానంలో విత్తనశుద్ధి అనువైనదన్నారు. రసం పీల్చే తామర పురుగు, పేనుబంక పరుగులను నివారించేందుకు ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. ఈ ప్రక్రియలో ముందుగా విత్తనానికి తగినంత తుమ్మ జిగురు కలిపి తర్వాత పొడి మందును వేసి విత్తనాలను బాగా కలియతిప్పి 15 నిమిషాలు నీడలో ఆరబెట్టాలి. ఇది తెల్ల నల్లిని తప్ప మిగిలిన రసం పీల్చే పురుగులన్నింటిని అరికడుతుంది.

సమీకృతం.. ఎంతో శ్రేయస్కరం



గొర్రెల మంద

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జీవాల పెంపకం దారులు గొర్రెలు, మేకలకు సమీకృత ఆహారాన్ని అందుబాటులో ఉంచడం ఎంతో శ్రేయస్కరం. వీటిని స్వయంగా తయారు చేసుకునే అవకాశముంది. మొక్కజొన్న, గోధుమ తవుడు, మినప, కంది, పెసర పొట్టు, వేరుసెనగ చెక్క, లవణ మిశ్రమం తగిన మోతాదులో సిద్ధం చేసుకుని తద్వారా పోషకాలు కల్గిన సమీకృత ఆహారాన్ని సిద్ధం చేసుకోవచ్చు. వీటి వాడకం ద్వారా కలిగే ప్రయోజనాలు ఎంతో పుష్కలంగా ఉంటాయి.

- సమీకృత ఆహార పదార్థాలు సరైన పాళ్లల్లో అందుతాయి.
- మేత వృథా అయ్యే అవకాశం ఉండదు. తేలిగ్గా జీర్ణం చేసుకుంటాయి.
- దాణా ఖర్చు 15 నుంచి 20 శాతం మేర తగ్గే అవకాశం ఉంటుంది.
- జీవాల్లో ఆశించిన విధంగా ఎదుగుదల ఉంటుంది.
- అనారోగ్య సమస్యలను తట్టుకునే శక్తి పెంపొందుతుంది.
- ఎలాంటి రసాయనాలు కలిసే అవకాశం లేక పోవడంతో జీవాలు మరింత పరిపుష్టిగా వృద్ధి చెందగలవు.

- డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్ బాబు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, శ్రీకాళహస్తి

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాధానాలు చెప్పిన మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్.

ప్రశ్న: కౌలు రైతులకు గుర్తింపు పత్రాలు పొందడం ఎలా.. గుర్తింపుతో ఉపయోగాలు ఏమిటి?

- గోపాల్‌రెడ్డి, మెలగముడి, రేణిగుంట మండలం

జవాబు: భూ యజమాని అనుమతితో ఏ సర్వే నంబర్లో ఎంత విస్తీర్ణం కౌలుకు చేస్తున్నారో వాటి వివరాలు, ఇద్దరి ఆధార్ కార్డులు రైతు సేవా కేంద్రంలో అందజేయాలి. ఇలా చేసిన తరవాత వీఆర్వో విచారణతో గుర్తింపు పత్రాలను అందజేస్తారు. వీటి కారణంగా పంట నష్ట పరిహారం, రాయితీపై ఎరువులు, విత్తనాలు రైతుకు అందుతాయి.

ఇసుక.. అక్రమ తవ్వకాలు, రవాణాపై..

భారీ జరిమానా విధిస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, పక్కనే ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిపేవారికి, అక్రమ రవాణా చేసేవారికి భారీగా జరిమానా విధిస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. ఉచిత ఇసుక విధానం తాజా మార్గదర్శకాలపై కలెక్టర్ మాట్లాడారు. 'జిల్లాలోని ఇసుక స్టాక్ యార్డులో ప్రస్తుతం 88,530 టన్నులు అందుబాటులో ఉంది. నిబంధనల అతిక్రమణపై ఆరు వాహనాలు సీజ్ చేసి రూ.3.6 లక్షల జరిమానా విధించాం. టాస్క్‌ఫోర్స్ బృందాలు అక్రమ తవ్వకాలు, రవాణాపై విచారణ చేపట్టాయి. అక్రమ తవ్వకాలు, రవాణాపై 08572-299509 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి. ప్రజల అవసరాల కోసం ఇసుక లభ్యత గల 20 మండలాల్లోని 44 గ్రామాలు గుర్తించాం. యంత్రాల సాయం లేకుండా ఉచితంగా తీసుకోవచ్చు. ప్రైవేటు స్థలాల్లో ఉన్నదాని విక్రయాలకు సదరు పట్టాదారు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కమిటీ ఆమోదం తర్వాత అనుమతులు జారీచేస్తామని' వెల్లడించారు. జేసీ విద్యాధరి, శిక్షణ కలెక్టర్ హిమవంశీ, భూగర్భగనుల శాఖ డీడీ సత్యనారాయణ పాల్గొన్నారు. ● కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 127 వినతులు అందాయి. * ఎస్సీ ఉప ప్రణాళికపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ హ్యాబిటేషన్లలో మౌలిక సౌకర్యాల కల్పనకు సర్వే చేపట్టాలని ఆదేశించారు.

ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలి

చిత్తూరు కలెక్టరేట్: వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజా సంఘాలు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసనలు చేపట్టాయి. జిల్లాలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాల్ని ప్రధాన కేంద్రాలుగా మార్చాలని ఏపీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లలిత, షకీల డిమాండ్ చేశారు. ● సమగ్ర శిక్షలో ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలని కలెక్టర్‌కు ఉద్యోగుల ఐకాస జిల్లా ఛైర్మన్ కృష్ణమూర్తి విన్నవించారు.. ● బోయకొండ గంగమ్మ దేవస్థానం అభివృద్ధి కోసం ఇళ్లు, వ్యాపార దుకాణాల్ని కోల్పోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ● రొంపిచెర్ల మండలం గాజులపల్లి ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులు భూమిలో సేద్యం చేయనీకుండా అడ్డుకుంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు వాపోయారు.

సత్వరమే విచారించి ఉంటే

చిన్నారి ప్రాణాలు దక్కేవి



అస్వియా తండ్రి అజ్మతుల్లాను పరామర్శిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు, న్యూస్‌టుడే: పోలీసులు సత్వరమే స్పందించి ఉంటే బాలిక అస్వియా ప్రాణాలు దక్కేవని.. పోలీసులు వైఫల్యం స్పష్టంగా ఉందని రాజంపేట ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం జగన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి న్యాయం కోరతారని తెలిపిన రెండు రోజుల్లో మంత్రులు రావడం, కేసును తేల్చడం చూస్తుంటే అనుమానం కలుగుతుందని ఫిర్యాదు అందిన వెంటనే అప్రమత్తమై ఉంటే ఆ బాలికను ప్రాణాలతో కాపాడి ఉండొచ్చని పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఉబేదుల్లా కాంపౌండుకు చెందిన అజ్మతుల్లాను ఆయన పరామర్శించి మాట్లాడారు. కేసును మరింత లోతుగా విచారణ చేసి నిందితులందరికీ కఠిన శిక్ష పడే విధంగా చేయాలన్నారు. ఇలాంటి దురాగతానికి పాల్పడాలంటే భయపడేలా ఉండాలన్నారు. బాధిత కుటుంబానికి వైకాపా తరపున సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, పురపాలక ఛైర్మన్ అలీంబాషా పాల్గొన్నారు.

'పసిబిడ్డ శవంతోనూ పెద్దిరెడ్డి రాజకీయం'

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: పసిబిడ్డ శవంతోనూ పెద్దిరెడ్డి రాజకీయం చేస్తున్నట్లు తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ ఆరోపించారు. స్థానిక తెదేపా జిల్లా కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిడ్డను కోల్పోయిన బాధలో అస్వియా తల్లిదండ్రులు ఉంటే, రాజకీయ లబ్ధి కోసం పాకులాడటం పెద్దిరెడ్డికి తగదని విమర్శించారు. ఇప్పటికైనా జగన్, పెద్దిరెడ్డి శవరాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. నాయకులు మధుయాదవ్, బాబునాయుడు, హరిబాబు, హేమచంద్ర పాల్గొన్నారు.

సమన్వయకర్తల నియామకం

చిత్తూరు(జిల్లా పంచాయతీ): పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఇ(కేంద్ర పథకాల) మండల సమన్వయకర్తలను నియమిస్తూ డీఆర్‌డీఏ పీడీ రవికుమార్‌నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించే బాధ్యత వారికి అప్పగించారు.





◗ కాణిపాకం, గాయత్రీదేవిగా మరగదాంబిక

◗ పార్వతీదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ

ఎంత పెద్ద బ్రాస్‌లెట్టో..

విలువ.. రూ.కోటి పైమాటే



ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి పేరు రవి. దసరా సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు చిత్తూరు జిల్లా నుంచి ఇంద్రకీలాద్రికి వచ్చారు. 1.300 కిలోల బంగారంతో చేసిన బ్రాస్‌లెట్ చేతికి అలంకరించుకున్నారు. దీని విలువ సుమారు రూ.కోటి పైమాటేనని ఆయన చెబుతున్నారు. దీన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు.

-ఈనాడు, అమరావతి

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 42 ఫిర్యాదులు



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 42 ఫిర్యాదులు అందాయి. ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో అందించగా.. ఎస్పీ మణికంఠ వాటిని స్వీకరించారు. కుటుంబ సమస్యలు 9, వేధింపులు 3, ఇంటి గొడవలు 1, నగదు సమస్యలు 8, భూ సమస్యలు 10, ఆస్తి గొడవలు 9, దారి గొడవలు 2 చొప్పున మొత్తం 42 ఫిర్యాదులు అందాయి. వాటిని వారంలోగా పరిష్కరించి తనకు నివేదించాలని ఎస్పీ ఆదేశించారు.

కనికరించండి.. పరిష్కారం చూపండి

☛ మండలాల్లో న్యాయం జరగడం లేదు

☛ అర్జీదారుల ఆవేదన

న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్

సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో కనికరించేవారు కరవయ్యారు.. కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవట్లేదు.. మండల స్థాయిలో పరిష్కారం దొరకడం లేదని వాపోయారు.. మా బాధల్ని ఆలకించి పరిష్కారం చూపాలని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించారు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు.

సర్వే చేయనీకుండా అడ్డుకుంటున్నారు



పిత్రార్జితంగా రెండెకరాల భూమి వారసత్వంగా సంక్రమించింది. అయితే ఆన్‌లైన్‌లో 30 సెంట్లు మాత్రమే నమోదైంది. మిగిలిన భూమి రికార్డుల్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఐదేళ్లుగా తిరుగుతున్నా న్యాయం జరగలేదు. ఈలోగా స్వార్థపరులు కొందరు ఇదే భూమికి సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించి ఆన్‌లైన్‌లో నమోదుచేసుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా స్పందన లేదు. నా భూమి సర్వే చేయనీకుండా అడ్డుకుంటున్నారు.

-నాగభూషణం, మద్దిపట్లపల్లె, ఐరాల మండలం

దౌర్జన్యాలు చేస్తున్నారు



వారసత్వంగా సంక్రమించిన భూమిని నాకు దక్కనీయకుండా దౌర్జన్యం చేస్తున్నారు. ఫోర్జరీ పత్రాలు సృష్టించి చాలా ఇబ్బందులకు గురిచేశారు. దీనిపై అధికారులకు గతంలోనే ఫిర్యాదు చేశాం. ఉండటానికి ఇల్లు లేక వృద్ధురాలైన తల్లితో కలిసి అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి విచారణ జరిపి భూమి నాకు దక్కేలా న్యాయం చేయాలి.

-సుజాత, కొమరగుంట, వెదురుకుప్పం మండలం


మా భూమి ఆక్రమించారు..



వావిల్‌తోటలో కొంత భూమి ఉంది. పక్షవాతం కారణంగా చాలా రోజులుగా మంచానికే పరిమితమయ్యా. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న సమయంలో కొందరు వ్యక్తులు నా భూమిలోకి అక్రమంగా చొరబడ్డారు. చుట్టూ ప్రహరీ నిర్మించారు. అధికారులు విచారణ చేసి చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నా.

-మోహన్‌రావు, ఎం.బండపల్లె, పూతలపట్టు మండలం

1బి మంజూరు చేయడం లేదు..



గ్రామంలో నా పేరిట 50 సెంట్ల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం ఉంది. అయితే 1బి ఇవ్వాలని తిరుగుతున్నా మంజూరు చేయడం లేదు. అధికారులు స్పందించి 1బి మంజూరు చేయాలి.

-కృష్ణమూర్తి, రెడ్డివారిపల్లె, ఐరాల మండలం

విజయవాణి ప్రింటర్స్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయవాణి సంస్థల అధినేత చంద్రశేఖర్‌మూర్తి

చౌడేపల్లె, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా చౌడేపల్లెలోని విజయవాణి ప్రింటర్స్ ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కించుకుంది. రూం టు రీడ్ ఇండియా ట్రస్టు యునైటెడ్ స్టేట్స్ ఏజన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ సంస్థ దిల్లీలో సోమవారం నిర్వహించిన టీచర్, లైబ్రేరియన్ ఛాయిస్ విభాగంలో విజయవాణి ప్రింటర్స్‌కు ప్రత్యేక గుర్తింపు దక్కింది. 8-12 ఏళ్ల చిన్నారులకు బాగా ఉపయోగపడే 'విలువైన సాయం' పుస్తకం విజేతగా నిలిచింది. 3-8 ఏళ్ల విభాగంలో 'సీసాలో ఎలుక' పుస్తకం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆ అవార్డులను ప్రింటర్స్ అధినేత నాయుని చంద్రశేఖర్‌మూర్తి నిర్వాహకుల నుంచి అందుకున్నారు.

మాతాశిశు మరణాలు నియంత్రించండి

చిత్తూరు(వైద్యవిభాగం): మాతాశిశు మరణాలు నియంత్రించాలని జిల్లా టీకాల అధికారి హనుమంతరావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. హైరిస్కు గర్భిణులను గుర్తించి అన్ని పరీక్షలు చేసి ప్రణాళిక ప్రకారం కాన్పునకు వారం ముందుగానే ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. వైద్యులు ఉషశ్రీ, లత, శిరీష, స్పందన పాల్గొన్నారు.

టెట్‌కు 475 మంది హాజరు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: టెట్ జిల్లాలోని రెండు, చెన్నైలో ఓ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. 537మందికి గాను 475 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలోని ఎస్వీసెట్ కళాశాలలో 200మందికి.. 183 మంది, మదర్ థెరెసా ఇంజినీరింగ్ కళాశాలలో 260మందికి.. 229 మంది, చెన్నై కేంద్రంలో 77మందికి.. 63మంది పరీక్ష రాశారు.

ద్రవిడలో స్పాట్ అడ్మిషన్లు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల సోమవారం తెలిపారు. ఏపీ ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

క్వారీలో భారీ పేలుడు.. ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ యక్బాల్, అకీఫ్

పుంగనూరు గ్రామీణ: క్వారీలో వెల్డింగ్ పనులు చేస్తుండగా భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం మండలంలోని మేలుందొడ్డి సమీపంలో జరిగింది. మేలుందొడ్డి గ్రామ శివారులోని నరేంద్రబాబుకు చెందిన రామినేని క్వారీలో షెడ్డు నిర్మిస్తున్నారు. ఇనుప తలుపు, కిటికీలు అమర్చేందుకు పుంగనూరుకు చెందిన వెల్డర్ యక్బాల్ (34), అతని తమ్ముడు అకీఫ్ (18) వెళ్లారు. పనిచేస్తున్న సమయంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో అన్నదమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించారు. ఘటనాస్థలిని సీఐ శ్రీనివాసులు పరిశీలించి అనుమానాలు వ్యక్తం చేశారు. 'క్వారీ నిర్వాహకులు బ్యాటరీలు పేలడంతోనే ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. అయితే బండరాళ్లతో నిర్మించిన షెడ్డు గోడలు సుమారు వంద మీటర్ల దూరంలో ఎగిరి పడ్డాయి. రేకులు ముక్కలయ్యాయి. జనరేటర్ దెబ్బతింది. అయితే బ్యాటరీలు పాక్షికంగానే దెబ్బతినాయి. రేకులపైన సోలార్ ప్యానళ్లు, బ్యాటరీలు పేలాయి. ఈ స్థాయిలో తీవ్రత ఉందంటే షెడ్డులో నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు పేలడంతో ప్రమాదం జరిగిందని' అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

తొమ్మిది వరకు గడువు పొడిగింపు

చిత్తూరు(వ్యవసాయం): ఖరీఫ్ సీజన్ ఈ-పంట నమోదైన రైతుల ఈకేవైసీ నమోదు గడువును ఈ నెల తొమ్మిదో తేదీ వరకు పొడిగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారని జిల్లా అధికారి మురళీకృష్ణ తెలిపారు.

ఒకే రోజు వరుస చోరీలు



పారిశుద్ధ్య కార్మికుడు చిరంజీవి ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న నిపుణులు

సదుం, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు చెలరేగుతున్నారు. సోమవారం తెల్లవారుజామున సదుం సమీపంలోని వీఆర్‌ఆర్ కాలనీలో రెండు ఇళ్లలో చోరీ చేసి భారీగా బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయ సమీపంలో నివాసముంటున్న భాస్కర్‌స్వామి శనివారం ఇంటికి తాళాలు వేసి కుటుంబసభ్యులతో కలసి తిరుమల వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపల రెండు బీరువాల్లోని సుమారు 229 గ్రాముల బంగారు నగలు, 330 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ పక్క వీధిలోనే ఉంటున్న పారిశుద్ధ్య కార్మికుడు చిరంజీవి శనివారం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి చిత్తూరు వెళ్లారు. ఆదివారం సాయంత్రం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి.. 22 గ్రాముల బంగారు నగలు, 88 గ్రాములు వెండి పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేలిముద్రల నిపుణులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌షావలీ తెలిపారు.

భూ వివాదం కేసులో ఇద్దరికి జైలు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: భూ వివాదం కేసులో తండ్రీకొడుకులకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ సోమవారం స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఉమాదేవి తీర్పు చెప్పారు. ఏపీపీ కృష్ణారెడ్డి, కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం గ్రామానికి చెందిన మురుగేష్, వీరాస్వామి కుటుంబీకుల మధ్య భూవివాదం ఉంది. భూమి విషయంగా తరచూ గొడవ పడేవారు. మురుగేష్ తన భూమిని ఆక్రమించు కున్నాడని 2019 జులై 12న వీరాస్వామిని అడగ్గా.. దీంతో వీరిద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. వీరాస్వామి కుటుంబ సభ్యులు.. మురుగేష్‌పై రాయి, కత్తితో దాడి చేయడంతో అతడికి రక్త గాయాలయ్యాయి. దీనిపై మురుగేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వీరాస్వామి, అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పూర్వపరాలు పరిశీలించిన పిదప నేరం రుజువు కావడంతో నిందితులు వీరాస్వామి, అతడి కుమారుడు చరణ్‌కుమార్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పిడుగు పడి మహిళ మృతి

వడమాలపేట: మేదరమిట్టకు చెందిన నారాయణమ్మ(65) సోమవారం ఉదయం మేకలు మేపుకోవడానికి గ్రామ సమీపంలోని గుట్టకు వెళ్లింది. కొద్దిసేపటికి ఉరుములతో కూడిన మెరుపులు రావడం, అక్కడ పిడుగు పడటంతో స్పృహ తప్పి పడిపోయింది. సమీపంలోని వారు గుర్తించి పరుగులు తీయగా.. ఆమె అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.

మోటారు తలపై పడి యువకుడు..

చిత్తూరు(నేరవార్తలు): బిహార్ రాష్ట్రం బక్సార్ జిల్లా, మేతాపూర్ గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ చౌహాన్(30) చిత్తూరు నగరం మురకంబట్టులోని ఓ పార్సిల్ సర్వీసులో పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి మోటార్లను తీసుకెళ్లి పేరుస్తుండగా ఓ మోటారు అతడి తలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. చిత్తూరు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

వీఆర్వోల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వీఆర్వోలను బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-1 వీఆర్వోలు 240 మంది, గ్రేడ్-2కు చెందిన 125 మందిని బదిలీ చేశారు.

సూచనలు.. హెచ్చరికలతో సరి

చౌడేపల్లె, న్యూస్‌టుడే: స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూముల ఆక్రమణలపై దేవాదాయ శాఖ అధికారులు సూచనలు, హెచ్చరికలతో సరి పెట్టడం ఆనవాయతీగా మారింది. సోమవారం దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనరు చిట్టెమ్మ ఆ భూములు పరిశీలించారు. ఈవో కమలాకర్‌రావుకు సూచనలు చేసి వెళ్లిపోయారు. ఆక్రమణలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

చిత్తూరు
● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి

స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో



దస్త్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

యాదమరి, న్యూస్‌టుడే: జంగాలపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో 2023లో ఏపీఎస్పీఆర్‌ఐ బెటాలియన్‌కు కేటాయించిన 40 ఎకరాల స్థలాన్ని ఆర్డీవో శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. స్థల సర్వే వివరాలు, సరిహద్దులు, రికార్డులను తనిఖీ చేశారు. తహసీల్దారు పార్థసారథి, ఆర్‌ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో కేంద్ర భూశాస్త్ర మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి గోపాల్‌క్రిష్ణ

ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపమే లక్ష్యం

పాలసముద్రం, న్యూస్‌టుడే: గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నూతన రూపం తేవడానికి, గ్రామీణం నుంచి పట్టణాలకు వలసలు నియంత్రించేందుకు ఆత్రియా ఫౌండేషన్ 'చిత్తూరు ప్రాజెక్టు' ప్రారంభించామని కేంద్ర భూశాస్త్ర మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి గోపాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం తిరుమలరాజుపురం పంచాయతీ పాళ్యంలో ఆత్రియా ఫౌండేషన్, యూనివర్సిటీ, పవర్ మరియు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భాగస్వామ్యంతో ప్రాజెక్టు చిత్తూరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 180 ఎకరాల్లో వ్యవసాయం, పునరుత్పాదక శక్తి, విద్య మరియు ఆరోగ్యంపై భవిష్యత్తు తరాలకు మెరుగైన సమాజాన్ని అందించనున్నారన్నారు. గ్రామాల్లో కొండలు, గుట్టలు దెబ్బతినడం, ప్రకృతి వ్యవసాయంతో జీవనం, సౌలభ్యత ఖర్చులు తగ్గించుకునేలా రైతుల కోసం కృషి చేస్తామన్నారు. ప్రతి రైతును ఆదర్శంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ ఆత్రియా ఫౌండేషన్ లక్ష్యమని ఛైర్మన్ సుందరరాజు పేర్కొన్నారు. వెల్‌నెస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రావు, నందన గ్రూప్ ఛైర్మన్ రవిచంద్రన్, ఆలిండియా క్షత్రియ సంఘం ఛైర్మన్ గిరిరాజు, బాలరాజు, గంగరాజు, నాగరాజు, పురుషోత్తంరాజు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శివరాజు



గుడిపాల: నూతన ఎంపీడీవోగా శివరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తెదేపా కన్వీనర్ సుబ్రహ్మణ్యం, నాయకులు హేమాద్రి, సాంబశివ నాయుడు, మాజీ సర్పంచులు రవినాయుడు, పయణి, ఉదయ, అమరేంద్రబాబు ఆయన్ను సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



బాధితుడితో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు నగరం : ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజారోగ్య విభాగానికి 3, ఇంజినీరింగ్ 2, టిడ్కో 1, రెవెన్యూ 1, పట్టణ ప్రణాళిక 1, మెప్మాకు 1 చొప్పున వినతులు అందాయి. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్‌వో అనిల్ కుమార్, టీపీవో శుభప్రభ పాల్గొన్నారు.


కరుణించండి సారూ..!

● వ్యయప్రయాసలకోర్చి వస్తున్నాం ● బాధితుల కన్నీటి వేదన

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు)

ఏళ్ల తరబడి సమస్యల పరిష్కారం కోసం మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. పరిష్కారం దేవుడెరుగు.. కనీసం మండలాల్లో తమ గోడు పట్టించుకునే నాథుడే లేడు.. అధికారులు కనీసం స్పందించడం లేదు.. అందుకే విసుగొచ్చి ఎన్నో వ్యయప్రయాసల కోర్చి చిత్తూరు ఆర్డీవో కార్యాలయానికి వచ్చాం.. మీరైనా దయచేసి తమ సమస్యలు ఆలకించి పరిష్కరించాలని పలువురు బాధితులు వేడుకున్నారు.. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కన్నీటి పర్యంతమయ్యారు.

10ఏళ్లుగా తిరుగుతున్నా..



భూమి కొనుగోలు రిజిస్టర్ ధ్రువీకరణ పత్రాలు, తన అనుభవంలో ఉన్న భూమిని తన పేరిట మార్పు చేయాలని పదేళ్లుగా తిరుగుతున్నా న్యాయం జరగలేదని చిత్తూరు గ్రామీణ మండలం 194. వెంకటాపురానికి చెందిన రైతు భాస్కర్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకున్న రెండెకరాల భూమిలో.. 19 సెంట్లు తమ గ్రామానికి చెందిన వేరే వ్యక్తి పేరుపై నమోదైందన్నారు. ఈ భూమి తనదని ధ్రువీకరణ పత్రాలు సమర్పించినా రెవెన్యూ అధికారులు తన పేరిట మార్పు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యాడు.

మా భూములకు వేరే పేర్లు..



తమ ఆధీనంలో ఉన్న భూములు ఇతర పేర్లపై మార్చేశారు. వీటిని మళ్లీ తమ పేరిట మార్పు చేయాలని కొన్నేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ ఆలకించలేదని ఐరాల మండలం నాగవాండ్లపల్లెకు చెందిన రైతులు వాసుదేవన్, మునివెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తాము సాగు చేస్తున్న ఒకటిన్నర ఎకరం భూమి.. గ్రామంలోని ఓ వ్యక్తి పేరుపై 1బీలో ఉన్నదని వాసుదేవన్ పేర్కొన్నాడు. తన అనుభవంలో ఉన్న 72 సెంట్ల భూమికి పట్టాదారు పుస్తకం ఉన్నా.. ప్రస్తుతం ఈ భూమి ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే వేరే వ్యక్తి పేరిట ఉందని మునివెంకటయ్య వాపోయాడు. తమ పూర్వీకుల నుంచి అనువంశికంగా వస్తున్న భూములను తమ పేరిట మార్పు చేయాలని కొన్నేళ్లుగా తిరుగున్నామని, ఇప్పటికైనా పరిష్కరించాలని వారు వేడుకున్నారు.

వివరాలు 1బీలో లేవు..



తమ అనుభవంలో ఉన్న భూమి వివరాలు వన్ బీలో రావడం లేదంటూ చిత్తూరు గ్రామీణ మండలం అప్పయ్యగారిపల్లెకు చెందిన రైతు అశోక్ నాయుడు వాపోయారు. తనకున్న సుమారు ఐదు ఎకరాల భూమిలో మామిడి తోట కలదు. గతంలో భూమి వివరాలు 1బీలో నమోదైంది. ఆరు నెలల క్రితం 1బీ తీస్తే.. సర్వే నం. 627లోని 1.68 ఎకరాలు ఆన్‌లైన్‌లో లేకపోగా 1బీలోనూ లేదు. దీనిపై వీఆర్వోను అడిగితే సమాధానం చెప్పడం లేదు. అప్పటి నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. సమస్య పరిష్కరించి తనకు న్యాయం చేయాలి.

దారి పునరుద్ధరించాలి..

కొన్నేళ్లుగా తమ పొలాలకు వెళ్లే దారిని కొందరు వ్యక్తులు మూసేశారని, దాన్ని పునరుద్ధరించాలని చిత్తూరు మండలం 194. బండపల్లె పరిధి పండరిపురం రైతులు దిలీప్‌కుమార్, బాలాజీ తదితరులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. గ్రామ రెవెన్యూ లెక్కల ప్రకారం తమ పొలాలకు వెళ్లేందుకు 20 అడుగుల దారి ఉందని, ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఫెన్సింగ్ వేసి మూసేశారన్నారు. ప్రస్తుతం పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) చిత్తూరు నగరం: 80085 74598 నగరి: 80085 74568 గంగాధరనెల్లూరు: 80085 74605 పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, యాదమరి

సమస్య: స్థానిక యూనియన్ బ్యాంకు నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారి బురదమయమైంది. **- స్థానికులు**

సమాధానం: మట్టి తోలి దారి బాగుచేస్తాం. **-సుందరేశన్, పంచాయతీ కార్యదర్శి, యాదమరి**

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: నీవా నది పరివాహక ప్రాంతం వీరభద్ర కాలనీలో నివాసాల ఎదుట మురుగునీటి నిల్వ కారణంగా దోమలు, దుర్వాసన ఎక్కువగా ఉన్నాయి. **- స్థానికులు**

సమాధానం: వీరభద్రకాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. **-అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి**



మంత్రి లోకేశ్‌తో చిట్టిబాబు, విఐటీ ఛాన్స్‌లర్ విశ్వనాథం

విద్యాభివృద్ధికి కృషిచేయండి: మంత్రి లోకేశ్

పాలసముద్రం, న్యూస్‌టుడే: గ్రామీణ విద్యార్థుల విద్యాభివృద్ధికి విఐటీ తరఫున సహకరించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కోరారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి లోకేశ్‌ను.. ఏపీ విఐటీ ఛాన్స్‌లర్ విశ్వనాథం, వైస్ ఛాన్స్‌లర్ శంకర్‌తో కలిసి చిట్టిబాబు సోమవారం కలిసి మాట్లాడారు. గ్రామాల్లో నిరుద్యోగ యువతపై ప్రత్యేక దృష్టి సారించి వారికి ఉద్యోగ అవకాశం కల్పించేలా తీర్చిదిద్దాలని మంత్రి లోకేశ్ వారికి సూచించారు. విఐటీ ద్వారా సుశిక్షితులైన యువతను సమాజానికి అందించాలని, అప్పుడే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందన్నారు. అనంతరం మంత్రిని వారు సత్కరించారు.



హేమలతకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుళ్ల కుటుంబాలకు సోమవారం ఎస్పీ మణికంఠ ఆర్థిక సాయం అందజేశారు. బైరెడ్డిపల్లి స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఇ.టి.వి.చలపతి గత నెల 26న మృతి చెందడంతో ఆయన కుమారుడు మధుసూదన్‌కు రూ.లక్ష చెక్కు అందజేశారు. వెదురుకుప్పం స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ గత నెల 27న మరణించిన హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన రాజు సతీమణి హేమలతకు రూ.లక్ష చెక్కు అందించారు. పోలీసు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్: కాత్యాయనిగా పొన్నియమ్మన్ అమ్మవారు ● కలెక్టరేట్: కట్టమంచి సాయిబాబా మందిరంలో మహాచండీ అలంకరణ ● కార్వేటినగరం: గాయత్రీదేవి అలంకరణలో బంగారమ్మ ● జీడీనెల్లూరు: సంతానలక్ష్మిగా అల్లియల్లమ్మ ● నగరి: లలితా త్రిపుర సుందరిగా.. ● నగరి: స్కంధ మర అలంకరణలో అన్నపూర్ణాదేవి ● బంగారుపాళ్యం: మహాచండీదేవి అలంకరణలో బోయకొండ గంగమ్మ



తవణంపల్లె: దిగుమాఘంలో లలితాదేవి అలంకరణ
పుత్తూరు: అన్నపూర్ణాదేవిగా గ్రామదేవత ఆరేటమ్మ

మహాచండీ.. నమామి

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిత్తూరు నగరం సంతపేటలోని సుఖీభవ హాల్‌లో మహాచండీ యాగాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ దంపతుల ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారి ఉత్సవర్లు వివిధ రూపాల్లో అనుగ్రహించారు.



పుత్తూరు: లక్ష్మీశివదుర్గ అలంకరణలో శ్రీద్రౌపదీదేవి,
అన్నపూర్ణాదేవి అలంకరణలో గోవిందమ్మ

శాప్ ప్రతిష్ఠ మరింత పెంచాలి



రవినాయుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు(జిల్లా పంచాయతీ): సంతపేటలోని జీజేఎం సుఖీభవ కన్వెన్షన్ హాలులో నవచండీ యాగంలో ఉన్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను.. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సోమవారం కలిశారు. ఆయన్ను.. ఎమ్మెల్యే సత్కరించారు. దేశంలోనే శాప్ ప్రతిష్ఠ, గౌరవాన్ని పెంచేందుకు కృషిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ● వరసిద్ధి వినాయకస్వామిని శాప్ ఛైర్మన్ రవినాయుడు దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ఆపై స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయురారోగ్యాలు కలగాలని సీఎం చంద్రబాబు, భువనేశ్వరి పేరున ప్రత్యేక పూజలు నిర్వహించానని రవినాయుడు తెలిపారు. ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు ఉన్నారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు.. చిత్తూరు(నేరవార్తలు): చిత్తూరు టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య.. తేనబండ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా వస్తున్న ఆటోను నిలువరించి తనిఖీ చేయగా అందులో రూ.15 వేల విలువ చేసే సారా గుర్తించి. దీంతోపాటు రూ.3.6 లక్షల విలువ చేఐసే ఆటో స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా చేస్తున్న తేనబండకు చెందిన రాజేష్, సంతపేటకు చెందిన కుట్టిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సమష్టి కృషితో మొగిలీశ్వరస్వామి ఆలయ అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం: సమష్టి కృషితో మొగిలీశ్వరస్వామి ఆలయ అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే మురళీమోహన్ భక్తులకు పిలుపునిచ్చారు. ఆలయ అభివృద్ధిపై పరిసర గ్రామస్థులు, ఆలయాధికారులు, నాయకులతో సోమవారం రాత్రి ఎమ్మెల్యే సమీక్షించారు. ఆలయ కమిటీ వేయాలని, కాణిపాకం నుంచి మొగిలి, పలమనేరుకు బస్సులు నడపాలని, చిత్తూరు పలమనేరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు మొగిలిలో ఆపాలని, మరుగుదొడ్ల వసతి, పారిశుద్ధ్య కార్మికుల నియామకం, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఎండోమెంట్ ఆధీనంలో ఉన్నా అభివృద్ధికి నోచుకోకపోవడానికి కారణాలను ఆయన తెలుసుకుని దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చేపడతామన్నారు. తెదేపా మండల అధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు, క్లస్టర్ అధ్యక్షులు ధరణినాయుడు, జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు కోకా ప్రకాష్, ఉపాధ్యక్షులు కమలనాథ్‌రెడ్డి, కార్యదర్శి జనార్దన్, ఆలయ ఈవో మునిరాజా, సిబ్బంది పాల్గొన్నారు.



కాళేపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీషిర్డీ సాయినాథుడి మందిరంలో శ్రీసాయిబాబా పాలరాతి విగ్రహావిష్కరణ సోమవారం వేడుకగా జరిగింది. **- న్యూస్‌టుడే, పూతలపట్టు**

ప్రపంచంతో పోటీపడే పౌరులుగా ఎదగాలి

పాలసముద్రం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రపంచంతో పోటీపడే పౌరులుగా ఎదగాలని లిటిల్‌మోర్ ఇన్నోవేషన్ ల్యాబ్స్ సీఈవో శ్రీకాంత్ గణేశన్ పేర్కొన్నారు. తిరుమలరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆత్రియా ఫౌండేషన్ ఛైర్మన్ సుందరరాజు ఆధ్వర్యంలో సీఈవో శ్రీకాంత్ గణేశన్ 75 మంది విద్యార్థులకు రూ.20 లక్షల విలువ చేసే ట్యాబ్‌లు అందజేసి మాట్లాడారు. పధానోపాధ్యాయుడు మురుగదాస్, సుధాకర్, నిర్వాహకులు గంగరాజు, బాలరాజు, పాఠశాల కమిటీ ఛైర్మన్ పయణి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కుట్టుమిషన్ అందిస్తున్న సీఎంజీ రఘురామ్

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) సీఎంజీ రఘురామ్ అన్నారు. చిత్తూరు నగరం ఇరువారం పీహెచ్ కాలనీలోని ఎన్‌ఏసీ శిక్షణ ప్రాంగణంలో టైలరింగ్ శిక్షణ ముగించిన మహిళలకు సోమవారం కుట్టు యంత్రాలు పంపిణీ చేశారు. శిక్షణ కలెక్టర్ హిమవంశీ, ఎస్‌ఏసీ ఏడీ సతీష్‌చంద్ర, గుణశేఖర్, నారాయణ, చైతన్య, మునెప్ప, డేవిడ్, శాంతకుమార్, వెంకటేష్, నారాయణ పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి కృషి



దస్త్రంపై సంతకం చేస్తున్న మాధవయ్య

పుత్తూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంజి మాధవయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆ శాఖ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ తనూజా రాణి సమక్షంలో ఆ రాష్ట్ర ఛైర్మన్ నందం అబద్ధయ్య పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆశీస్సులతో తనకు రాష్ట్రంలో ఈ పదవి వచ్చిందని, ఈ కార్పొరేషన్ ద్వారా చేనేతల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు జడ్పీ: ఉద్యోగ, ఉపాధ్యాయులు జడ్పీ పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. జడ్పీ కార్యాలయంలో ఆయనకు సోమవారం తిరుపతి జిల్లా ఎస్టీయూ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, పీఎఫ్ సమస్యలపై చర్చించారు. పీఎఫ్ పెండింగ్ షెడ్యూల్స్ మండలాల నుంచి జడ్పీకి వచ్చాయని, వాటిని పరిశీలించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తామని, వ్యక్తిగత ఖాతాల క్రమబద్ధీకరణకు మూడు నెలలు అవసరమని, తుది మొత్తాల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని సీఈవో హామీ ఇచ్చారు. నాగేశ్వరరావు, ధనంజయనాయుడు, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం, నాయకులు వెంకటేశయ్య పాల్గొన్నారు.

బాలలు భళా..

క్రీడల్లో సత్తా చాటి.. పతకాలు గెలిచి

న్యూస్‌టుడే, చిత్తూరు(క్రీడలు)



సాధన చేస్తే సాధించలేనిది ఏమీ లేదని నిరూపిస్తున్నారు ఈ పిల్లలు.. క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో ప్రతిభను మెరగుపరచుకుని వచ్చిన అవకాశాల్ని అందిపుచ్చుకున్నారు.. జిల్లా జట్లకు ఎంపిక కావడమే కాకుండా ఆటల్లో సత్తా చాటి భళా అనిపించారు.. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ పోటీల్లో సత్తా చాటడమే లక్ష్యంగా దూసుకెళ్తున్నారు వీరు.

ఖోఖోలో మేటి..



ఖోఖోలో మేటిగా రాణిస్తున్నాడు జీడీనెల్లూరు మండలం మహదేవమంగళం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సామాన్య కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఈ విద్యార్థి క్రీడల్లో ఎంతో చురుకు. అండర్-14, అండర్-16 విభాగాల్లో గతంలో స్కూల్ గేమ్స్‌లో గతేడాది రాష్ట్ర స్థాయిలో పతకాలు కైవసం చేసుకున్నాడు. జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టుకి ఎంపికయ్యాడు. ఖోఖోలో జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడమే తన ఆశయమని అంటున్నాడు ప్రవీణ్‌కుమార్.

సైక్లింగ్‌లో ..



నగరంలోని సంతపేటకు చెందిన విష్ణుసాయి సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటాడు. అండర్-14 బాలుర విభాగంలో గతేడాది జరిగిన సైక్లింగ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. రోజూ సైకిల్ తొక్కడం ద్వారా కచ్చితత్వం, వేగాన్ని అలవాటు చేసుకున్నానని, తన విజయానికి కారణం అదేనని అంటున్నాడు. గతంలో ఎన్నడూ సైక్లింగ్ పోటీలకు వెళ్లలేదని, వ్యాయామ శిక్షకుల ప్రోత్సాహంతో విజయం సాధించగలిగానని పేర్కొన్నాడు విష్ణుసాయి.

జంప్‌రోప్‌లో రజతం..



గోకుల్ అంజన్.. నగరంలోని ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శారీరక దృఢత్వం సాధించేందుకు క్రీడల్లో చేరిన ఈ విద్యార్థి జంప్‌రోప్ క్రీడాంశంపై ఎంతో ఆసక్తి పెంచుకున్నాడు. గత రెండేళ్లుగా సాధన చేస్తున్నాడు. గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తన ప్రతిభ చూపి రజతాన్ని గెలుచుకున్నాడు. దీంతోపాటు జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. గోకుల్ అంజన్ చదరంగంలోనూ దిట్ట. జంప్‌రోప్ జాతీయ స్థాయి క్రీడల్లో పతకం గెలిచి వస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నాడు.



దినేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధుమిత్రులు

దినేష్ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి

జీడీనెల్లూరు, న్యూస్‌టుడే: బెట్టింగ్ వ్యసనంతో అప్పుల పాలై కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకున్న ఘటనలో చివరిగా మృతి చెందిన దినేష్(22) మృతదేహానికి సోమవారం సాయంత్రం జీడీనెల్లూరులో అంత్యక్రియలు నిర్వహించారు. అతడి మృతదేహాన్ని వేలూరు నుంచి చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తెచ్చి, శవపరీక్షలు నిర్వహించి సాయంత్రం కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. అనంతరం అశ్రునయనాల మధ్య ఆ యువకుడి మృతదేహానికి బంధుమిత్రులు అంత్యక్రియలు నిర్వహించారు. మరోవైపున సీఐ లక్ష్మీనారాయణ స్థానిక స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెట్టింగ్ వ్యసనానికి పాల్పడితే కుటుంబ పరిస్థితి ఏమవుతుందో దినేష్ దుస్థితి చూసి యువత నేర్చుకోవాలన్నారు. పిల్లలను కష్టపడి పెంచే తల్లిదండ్రులకు ఇలాంటి దుస్థితి రాకూడదన్నారు. బెట్టింగ్‌కు పాల్పడినా, నిర్వహించినా కఠినమైన కేసులు నమోదు చేస్తామని, బెట్టింగ్‌కు పాల్పడేలా ప్రోత్సహించే బుకీలపైనా విచారణ చేపట్టి కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు



కిషోర్‌ను సత్కరిస్తున్న వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్ కుమార్

పురస్కార గ్రహీతకు సత్కారం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ద్రవిడ విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయ శాఖలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కిషోర్ ఇటీవల చెన్నైలోని శాలీస్ ఆధ్వర్యంలో జాతీయ డైనమిక్ గ్రంథాలయ అధికారిగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డును అందుకున్న కిషోర్‌ను సోమవారం వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ శాలువతో సత్కరించారు.

ఏవోగా హరిబాబు

సదుం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఏవోగా హరిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా రేణిగుంట నుంచి ఇక్కడికి వచ్చారు. సీనియర్ సహాయకురాలిగా రమణమ్మ బాధ్యతలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:

సమస్య: బైరెడ్డిపల్లె ప్రధాన రహదారిలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలతో పాదచారులపైకి ఎగసి పడుతోంది. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. **- స్థానికులు**

సమాధానం: పరిశీలించి నివారణ చర్యలు తీసుకుంటాం.

- సదాశివయ్య, పంచాయతీ కార్యదర్శి, బైరెడ్డిపల్లె

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే :

సమస్య: మండలంలోని నెక్కుంది పంచాయతీ పెద్ద అల్లాపురంలో వారం కిందట తాగునీటి సమస్య ఏర్పడింది. బోరు మోటారు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలి. **- బాబు, గ్రామస్థుడు**

సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- బసవరాజ, పంచాయతీ కార్యదర్శి**

పలమనేరు, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని పెద్దచెరువు కట్టమీద రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగాయి. రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పిచ్చిమొక్కలు తొలగించాలి. **- కుమార్, పలమనేరు**

సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-ఎన్.వి.రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్**

శాంతిపురం, న్యూస్‌టుడే:

సమస్య: మండల కేంద్రం నుంచి ఆరిముత్తనపల్లె మార్గంలో చెత్త దిబ్బ పేరుకుపోయింది. సీసీ రోడ్డుపైనే చెత్త నిల్వ ఉండటంతో అసౌకర్యం ఎదురవుతోంది. **- కిషోర్, శాంతిపురం**

సమాధానం: వెంటనే పరిశీలించి చెత్త దిబ్బలు తొలగిస్తాం. **- అశ్వర్థనారాయణ, పంచాయతీ కార్యదర్శి**

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ



మధుసూదన్‌కు చెక్కు ఇస్తున్న ఎస్పీ

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుళ్ల కుటుంబాలకు సోమవారం ఎస్పీ మణికంఠ ఆర్థిక సాయం అందజేశారు. బైరెడ్డిపల్లెలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఇ.టి.వి.చలపతి గత నెల 26న మృతి చెందడంతో ఆయన కుమారుడు మధుసూదన్‌కు రూ.లక్ష చెక్కు అందజేశారు. అండగా ఉంటామని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉదయ్‌కుమార్, సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి



అర్జీదారుడితో మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖాధికారులను కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిశీలించి, ఆయా శాఖాధికారులను అందించి, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

ఉన్నత పాఠశాలకు యూపీఎస్ వితరణ



సమావేశమైన పూర్వవిద్యార్థులు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని శంకర్రాయలపేట జడ్పీ ఉన్నత పాఠశాల 1994-95 పది బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు అవసరమైన రూ.70వేల విలువైన యూపీఎస్‌ను వితరణగా అందించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిరవహించి పాఠశాల అభివృద్ధికి తమవంతుగా సహకారం అందించారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని వేదవతి అభినందించారు. ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి చిరు జ్ఞాపికలు అందజేశారు.



వర్షపు నీటిలో మరమ్మతులకు గురై నిలిచిన ఆటో (పాతచిత్రం)



కొత్తపేట రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన వర్షపు నీరు (పాతచిత్రం)

వర్షమొస్తే వణుకు.. తీరదా బెరుకు



కృష్ణగిరి రోడ్డు కూడలి వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి దుస్థితి (పాతచిత్రం)

- ఏళ్ల తరబడి ప్రజలకు ఇబ్బందులు
- ప్రమాదాలు జరిగినా కలగని కనువిప్పు
- సీఎం చంద్రబాబుపైనే ఆశలన్నీ

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: రైల్వే లెవల్ క్రాసింగ్‌లకు శాశ్వత పరిష్కారమంటూ ఆ శాఖ అధికారులు చూపిన కింది వంతెనలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రధానంగా పట్టణాల్లో వీటి వల్ల అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చిన్నపాటి వర్షానికే వరద నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు సైతం కింది వంతెన కింద నిలిచిపోతున్నాయి. ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి. సాక్షాత్తూ సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఈ సమస్య అధికంగా ఉంది. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదు. కడా ఏర్పాటు చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిన ఆయన.. కింది వంతెల సమస్యను పట్టించుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వర్షాకాలంలో ఏటా అవస్థలే..

పురపాలిక పరిధిలోని క్రిష్ణగిరి రోడ్డు కూడలి వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి, కొత్తపేటకు వెళ్లే మార్గంలోని అండర్ బ్రిడ్జి, దళవాయికొత్తపల్లె రైల్వే అండర్ బ్రిడ్జిలు వర్షమొస్తే చిన్న చెరువులుగా మారిపోతాయి. మోస్తరుగా కురిస్తే రైల్వే బ్రిడ్జి కింద వెళ్లాలంటే వాహనచోదకులకు వణుకే. బెంగళూరు-చెన్నై ప్రధాన రైల్వే మార్గంలోని కుప్పం మీదుగా పదుల సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అంతర్రాష్ట్ర సరకు రవాణాకు ప్రధానమే. వీటి కారణంగా తరచూ రైల్వే గేటు మూతపడుతుండటంతో గంటల తరబడి గేటు వద్ద పడిగాపులు కాయాల్సిన వచ్చేది. వర్షాకాల మొస్తే ప్రజలు ఇబ్బందులు వర్ణణాతీతం.

తెదేపా చొరవ.. వైకాపా విస్మరణ

సమస్యలను పరిష్కరించేందుకు 2018లో తెదేపా ప్రభుత్వం కొత్తపేట, దళవాయికొత్తపల్లె ప్రాంతాలలో రైల్వే పై వంతెనలకు నిధులు కేటాయించి, పనులను ప్రారంభించింది. అప్పుడు వేగంగా సాగిన పనులు.. వైకాపా హయాంలో ఆలస్యంగా పనులు పూర్తయ్యాయి. అయితే నిత్యం వర్షం కురిసినప్పుడు చెరువుగా మారుతోంది. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలుస్తున్న వర్షపు నీటిలో ద్విచక్ర వాహనాలు మధ్యలో నిలిచిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం తెదేపా ప్రభుత్వం రావడం, చంద్రబాబు సీఎం కావడంతో ప్రజలు ఆయనపైనే ఆశలు పెట్టుకున్నారు.

తరచూ మొరాయిస్తున్న మోటార్లు

అండర్ బ్రిడ్జిల్లో నిలిచే వర్షపు నీటిని తొలగించేదుకు మోటార్లు అమర్చి తోడుతుంటారు. అయితే మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో వర్షం కురిసిన మరుసటి రోజుల వరకు రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దళవాయికొత్తపల్లె నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలో మురుగు ప్రవహిస్తూ.. నిత్యం మురుగుపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. ఈ విషయమై పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు వివరణ కోరగా, సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి వారోత్సవాలు

రామకుప్పం: మండల కేంద్రం శివార్లలో వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ప్రాకారోత్సవాల్లో భాగంగా వేకువజామునే నెయ్యాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం నుంచి కుప్పం పలమనేరు నియోజకవర్గాల్లోని ప్రజలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ మాడవీధుల్లో శ్రీవల్లీ దేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్యస్వామి మయూర వాహనంపై ఊరేగారు.

అతివేగమే ప్రమాదాలకు కారణం: జేవీవీ

పలమనేరు: మొగిలిఘాట్‌లో అతివేగమే ప్రమాదాలకు కారణమని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గిరిధర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు పనిగట్టుకుని సామాజిక మాధ్యమాల్లో భూతాలు, ప్రేతాలు అంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. నిత్యం రాత్రి సమయాల్లో సమీపంలోని పరిశ్రమల్లో పని చేయడానికి వెళుతున్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. గ్రంథాలయాధికారి హేమంత్ కుమార్, జేవీవీ సభ్యులు సుదర్శనాచారి, బాబు, పుష్పరాజ్, శ్రీపురం సీతారామయ్య, యశ్వంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిరిధర్



▸ బైరెడ్డిపల్లె: లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో శ్రీసల్లాపురమ్మ ▸ పుంగనూరు: చదళ్లలో చౌడేశ్వరీదేవి ▸ పుంగనూరు: వెన్న అలంకరణలో.. ▸ పలమనేరులో.. పుదిపట్లలో.. ▸ సోమల: కందూరులో.. ▸ సదుం: రెడ్డివారిపల్లెలో..

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

న్యూస్‌టుడే, బృందం: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉత్సవ శోభ నెలకొంది. ప్రధాన ఆలయాల్లో ఐదో రోజైన సోమవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. శక్తిదేవత ఆలయాలతో పాటు కల్యాణ వేంకటరమణస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. ప్రసన్న పార్వతీదేవి, విరూపాక్షి మారెమ్మ, కన్యకాపరమేశ్వరిదేవి, అన్నపూర్ణాదేవి, తాటిమాను గంగమ్మ, నడివీధి గంగమ్మ, చదళ్ల, ఏటవాకిలిలో గల అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు.



వి.కోట: దుర్గామాత ఆలయంలో లక్ష కుంకుమార్చన

వైభవంగా గ్రామోత్సవం



వీధుల్లో సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్ర స్వామి ఉత్సవమూర్తుల గ్రామోత్సవం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: [illegible] వెలసిన శ్రీరామచంద్రస్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాల్లో సోమవారం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణతో పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారిని సింహ వాహనంపై ఊరేగించారు.

మలుపు.. ప్రమాదానికి పిలుపు



మండలంలోని పలు రహదారుల్లో విరిగిపోయిన సూచిక బోర్డులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సదుం నుంచి పీలేరుకు వెళ్లేందుకు స్థానిక చెన్నకేశవస్వామి ఆలయం వద్ద రహదారి ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన సూచికలు విరిగిపోవడంతో వాహనదారులు దారి తెలియక తికమక పడుతున్నారు. సదుం-కలికిరి మార్గంలోని రేగళ్లరోడ్డు కూడలిలో ఏర్పాటు చేసిన బోర్డుకు మరమ్మతులు చేయించకపోవడంతో ఆ మార్గంలో వెళ్లేందుకు వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సదుం**

సూచిక తిరగబడి.. ప్రయాణికులు తడబడి



నాలుగోనంబరు జాతీయ రహదారి మీద ప్రయాణికులకు మార్గం చూపే సూచికలు అయోమయానికి గురిచేస్తున్నాయి. బోర్డు తప్పు మార్గం చూపుతుండటంతో పలువురు దారి తప్పారు. పలమనేరు-చిత్తూరు మార్గంలో మొగిలి వద్ద బోర్డు తిరగబడింది. ముళబాగలు వెళ్లే దారివైపు చిత్తూరు వచ్చేలా.. చిత్తూరు వైపునకు ముళబాగలు గుర్తు వచ్చేలా బోర్డు చూపిస్తోంది. బోర్డు సరిచేస్తామని తిరుపతి ఎన్‌హెచ్ పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. **- న్యూస్‌టుడే, పలమనేరు**

ఇద్దరు ఈవోపీఆర్డీలకు సన్మానం



ఈవోపీఆర్డీలు గోపాలప్రసాద్, రాజేంద్రబాలాజీను సన్మానిస్తున్న సిబ్బంది

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇద్దరు ఈవోపీఆర్డీలకు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. గంగవరం ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న తిరుమల గోపాలప్రసాద్ బదిలీపై బైరెడ్డిపల్లెకు.. ఇక్కడ పనిచేస్తున్న రాజేంద్రబాలాజీ పలమనేరుకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన, బదిలీపై వెళ్లిన ఈవోపీఆర్డీలను స్థానిక అధికారులు, సిబ్బంది సత్కరించారు.

ఏడుగురు చిన్నారులకు బ్లాక్‌బెల్ట్



బెల్టులు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు బ్లాక్‌బెల్ట్ సాధించారని బ్లూకాన్ కరాటే గ్రాండ్ మాస్టరు హనుమంతరావు తెలిపారు. పులినాడు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలను డా.సదాశివ, జోహరి, శరత్‌కుమార్‌లు నిర్వహించారు. ప్రణవి, యదునాథ్‌సాయి, చరణ్‌కుమార్, మిథున్, లోహిత్, హరికృష్ణ, గగన్ బ్లాక్ బెల్ట్ సాధించారన్నారు. వారిని అభినందించారు.

అవీ.. ఇవీ.. అన్నీ..



లీలామాధురి

బాధ్యతల స్వీకరణ.. పుంగనూరు గ్రామీణ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా చౌడేపల్లె ఎంపీడీవో లీలామాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సమస్యలు సత్వరం పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం.. పుంగనూరు: నియోజకవర్గంలో ఎస్‌డీపీఐ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కార్యదర్శి యూసూఫ్ అన్నారు. సోమవారం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో పార్టీ బ్రాంచ్ ఎన్నికలు నిర్వహించారు. భగత్‌సింగ్ కాలనీ అధ్యక్షుడిగా ఆసిఫ్, ఉపాధ్యక్షుడిగా రియాన్, కార్యదర్శిగా సిద్ధిక్ ఎన్నికయ్యారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం.. శాంతిపురం: కోతిగుట్టపల్లెకు సీసీ రోడ్డు నిర్మాణాన్ని మండల తెదేపా నాయకులు సోమవారం ప్రారంభించారు. కరేగౌనివూరు సమీప గంగమాంబ ఆలయం వద్ద నుంచి కోతిగుట్టపల్లె వరకు సిమెంట్ రోడ్డు వసతి కోసం రూ. 10 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు మండల తెదేపా అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్‌కుమార్ తెలిపారు.

సహ చట్టాన్ని వినియోగించుకోవాలి.. కుప్పం పట్టణం: సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆర్టీఐ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. కుప్పంలో సోమవారం సమాచార హక్కు చట్టం వార్షికోత్సవం రోజున ఆర్టీఐ ఏఎన్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్క సామాన్యుడు వాడుకోవాలన్నారు.

సంఘమిత్రను కొనసాగించాలి.. గంగవరం: మండలంలోని కీలపట్ల పంచాయతీ బండమీద జర్రావారిపల్లెకు చెందిన డ్రాక్వా మహిళలు సోమవారం స్త్రీ శక్తి భవనం ఎదుట ధర్నా చేశారు. సంఘమిత్ర శ్రీనివాసులును ఎలాంటి కారణాలు లేకుండా తొలగించి. కొత్తవారిని నియమించారని ఆరోపించారు. మంచిగా సేవలు అతన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏపీఎం హరినాథ్ స్పందిస్తూ మంగళవారం చిత్తూరు ఏపీడీ రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు వెనుదిరిగారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

పెద్దపంజాణి: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని చోరీ చేశారు. దుండగులు ఆలయం తలుపులు పగులగొట్టి హుండీ నగదు ఎత్తుకెళ్లారు. శబ్దం రావడంతో స్థానికులు కేకలు వేయడంతో దుండగులు ద్విచక్రవాహనంలో పారిపోయారని స్థానికులు తెలిపారు. దుండగులు ఉర్దూలో మాట్లాడారని, ముగ్గురు యువకులు చోరీకి పాల్పడినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల నుంచి మంగళంపేటకు వెళ్లే ప్రధానమార్గం బలిజపల్లె సమీపంలోని కల్వర్టు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు గాయపడ్డారు. వారం కిందట టిప్పర్ అధిక లోడ్ కారణంగా కల్వర్టు కూలింది. దీంతో పొలాల మీదుగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశారు. బురదలో ద్విచక్ర వాహనంలో వెళ్లిన పుచ్చులవారిపల్లెకు చెందిన అజయ్‌కుమార్ తీవ్ర గాయాలయాయి. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

పొలాలపై ఏనుగుల దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: పాతపేట పొలాల్లో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేశాయి. గ్రామానికి చెందిన ఎం.సుబ్రమణ్యం అనే రైతు సాగు చేసిన ఎకరా టమాటా, వై.సుబ్రమణ్యం, శ్రీనివాసులు ఎకరా వరిని ధ్వంసం చేశాయి. షఫీకి చెందిన మామిడి తోటలోని చెట్ల కొమ్మలు విరిచేశాయి.

నిద్రిస్తున్న వ్యక్తిపై..

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ఆదివారం మండలంలోని చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్ట గ్రామ సమీపంలోని మామిడితోటలో జరిగింది. రొంపిచర్ల మండలంలోని వారణాసివారిపల్లెకు చెందిన దొరస్వామి కుమారుడు సుబ్రహ్మణ్యం మామిడి చెట్ల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఒంటిమిట్టకు చెందిన నరసింహులు (పెద్దోడు) మరో ముగ్గురు కలసి ఇంట్లోకి వెళ్లి సుబ్రహ్మణ్యంను చితకబాదారు. సంచిలో ఉన్న రూ.50 వేలు తీసుకెళ్లారు. బాధితుడు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ విరమించుకోవాలి



నినాదాలు వినిపిస్తున్న నాయకులు

పలమనేరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను విరమించుకోవాలని వామపక్ష నాయకులు గిరిధర గుప్త డిమాండు చేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేశారు. కార్మికుల హక్కులను కాలరాయడమే అన్నారు. విశాఖ ఉక్కు కార్మికుల హక్కు అంటూ నినాదాలు వినిపంచారు. చెన్నకేశవులు, ధనమ్మ, ఖైరున్నీసా, సరోజమ్మ, హారతి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జాతీయ మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షుడు డీవీ మునిరత్నం అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. బెరపల్లె గ్రామానికి చెందిన వికలాంగుడైన కృష్ణప్ప భూమి సర్వే చేయాలని ఏడాది కిందట చలానా కట్టినా ఇంతవరకూ సర్వే చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కొందరు అగ్రకులస్థులు తప్పుడు పత్రాలు సృష్టించి భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. సుబ్రహ్మణ్య, శివన్న తిప్పయ్య పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

పొంచి ఉన్న ప్రమాదం.. ఆదమరిస్తే అనర్థం..!



▸ రహదారి పక్కన కంచె లేని నియంత్రిక



▸ నివాసాల వద్ద చేతికందే ఎత్తులో తీగలు

మండల పరిధి అబకలదొడ్డి పంచాయతీ కాకర్లవంకలో విద్యుత్తు నియంత్రిక, తీగల రూపంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వెదురుగుట్టపల్లె-తులసినాయనపల్లె రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక తీగలు చిన్నారుల చేతికందే ఎత్తులో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. చిన్నారులు ఆదమరిస్తే అనర్థాలు జరిగే ప్రమాదం లేకపోలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా నివాస గృహాల మధ్యలోనే చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. ఈవిషయంగా రెస్కో ఏడీఈ హిమ్మత్‌సాగర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదాల నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, శాంతిపురం**